క్లుప్తంగా

పోటీలకు తరలిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబాబాద్‌లో ప్రారంభమైన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి ఉషు మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు శుక్రవారం తరలివెళ్లారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు.

ఆహార అలవాట్లకు ప్రాధాన్యత

రాజాపూర్: ఆరోగ్యం విషయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రతలు తీసుకుంటూనే ఆహార అలవాట్లకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని కామెడియన్ ఆర్పీ అన్నారు. శుక్రవారం ముదిరెడ్డిపల్లి శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టును ప్రారంభించారు. విమాన సినిమా డైరెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం: మండల పరిధిలోని జమిస్తాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త రాముగౌడ్‌పై దాడిచేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు మిథున్‌రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఉత్సాహంగా ఇంటర్‌స్కూల్ క్రికెట్ టోర్నీ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో 2వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన మ్యాచుల్లో పలు జట్లు సత్తాచాటి సెమీఫైనల్‌కు చేరాయి. టోర్నీలో లిటిల్ స్కాలర్స్ స్కూల్, గెలాక్సీ స్కూల్, స్వామినారాయణ గురుకుల్, ఫాతిమా విద్యాలయం జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మ్యాచుల్లో ఫాతిమా విద్యాలయం జట్టు 5 పరుగుల తేడాతో ఉదయ మెమోరియల్ జట్టుపై, లిటిల్ స్కాలర్స్ జట్టు 7 వికెట్ల తేడాతో సెయింట్ ఆగ్నేస్ జట్టుపై, స్వామినారాయణ గురుకులం జట్టు 5 వికెట్ల తేడాతో ఎస్ఎస్ గుట్ట పాఠశాల జట్టుపై, గెలాక్సీ జట్టు 5 వికెట్ల తేడాతో న్యూటౌన్ హైస్కూల్ జట్టుపై గెలుపొందాయి. అంతకుముందు పాఠశాలల క్రీడాజట్లను హెచ్‌సీఏ నూతన అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అభినందించారు. జిల్లా క్రికెట్ క్రీడాకారులు రంజీస్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, సంయుక్త కార్యదర్శి క్రిష్ణమూర్తి,కోచ్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

సాక్షినెట్‌వర్క్: చిన్నచింతకుంట నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జి. మధుసూదన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసేందుకు శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్లారు. ధమగ్నాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. దేవరకద్ర పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి వస్తుండగా ఆయనకు మద్దతుగా కార్యక్రమం చేపట్టారు. దీంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. జి.మధుసూదన్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే మధుసూదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామని పేర్కొన్నారు.

జూనియర్ కళాశాల కోసం కలిసిరావాలి

మరికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకోసం యువత కలిసి రావాలని యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, ప్రధాన కార్యదర్శి రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఇక్కడి ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కోసం వస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల ఎదుట కళాశాల ప్రస్థవన తీసుకురావాలన్నారు. జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని వారిచే హామీ తీసుకోవాలన్నారు. ప్రచారం కోసం వస్తున్న అభ్యర్థుల దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామ యువత ముందుకు రావాల్సినా అవసరం ఎంతైనా ఉందన్నారు.

ముఖ ఆధారిత హాజరు నమోదు

నర్వ: డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థుల ముఖ హాజరు నమోదును చేపడుతున్నట్లు కల్వాల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రసన్నకుమారి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో డీఎస్ఈ ఎఫ్ఆర్ఈ యాప్ ద్వారా ఆధార్ అనుసరించి విద్యార్థుల హాజరు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి తరగతి వెళ్లే ముందు నమోదును చేపడుతున్నామన్నారు.

తాళ్ల తయారీ.. తండాకు ఉపాధి

- వృత్తిగా మార్చుకున్న కనకాపూర్ తండా వాసులు
- సారా తయారీని వదిలి.. ప్లాస్టిక్ తాళ్ల వైపు మళ్లిన వైనం





కనకాపూర్ తండాలో తాళ్లను తయారు చేస్తున్న ఓ కుటుంబం

అడ్డాకుల: మూసాపేట మండలం కనకాపూర్ తండా గిరిజనులు ప్లాస్టిక్ తాళ్ల తయారీతో ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు తండాలో వ్యవసాయంతో పాటు నాటు సారా తయారు చేసి జీవనం సాగించేవారు. కొన్నేళ్ల నుంచి గిరిజనులు నాటు సారా తయారీని వదిలేశారు. ప్రతి ఇంటి వద్ద ప్లాస్టిక్ తాళ్లను తయారు చేస్తున్నారు. తండాలో సుమారు 55 నివాస గృహాలు ఉండగా 200 మంది వరకు గిరిజనులు నివాసముంటారు. రెండు, మూడిళ్ల మినహా అన్ని ఇళ్ల వద్ద ప్లాస్టిక్ తాళ్లను తయారు చేస్తున్నారు. ఇందుకోసం సిమెంట్, ఎరువుల బస్తాలను కొనుగోలు చేసి తీసుకువస్తారు. వాటిని ఇంటి వద్ద శుభ్రం చేసి పోగులను వేరు చేస్తారు. తర్వాత చేతితో తిప్పే యంత్రాలతో తాళ్లను తయారు చేస్తున్నారు. కుటుంబంలో ఉండే వారందరూ దీనినే వృత్తిగా ఎంచుకుని ముందుకు సాగుతున్నారు.

సంతల్లో విక్రయాలు

కనకాపూర్ తండాలో తయారు చేసే తాళ్లను జిల్లాలోని ప్రధాన వారాంతపు సంతల్లో విక్రయిస్తారు. కోస్గి, పెబ్బేర్, కొత్తకోట, కవరంపేట, దేవరకద్ర, భూత్పూర్ తదితర ప్రాంతాల్లోని వారాంతపు సంతల్లో విక్రయాలు కొనసాగిస్తారు. గిరిజనులు తాళ్లను తయారు చేసి వాటిని వారే విక్రయించుకుంటారు. దీంతో పాటు వ్యవసాయ పొలాలు ఉన్న వారు పంటలను సాగు చేస్తారు. ఇదిలా ఉండగా తాళ్లను తయారు చేయడానికి యంత్రాల కొనుగోలు కోసం రుణాలను మంజూరు చేస్తే బాగుంటుందని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.

అందరూ తయారు చేస్తారు

మా తండాలో అందరూ ప్లాస్టిక్ తాళ్లను తయారు చేస్తారు. ప్రతి ఇంటి వద్ద తాళ్లను తయారు చేయడానికి కావాల్సిన సామాగ్రి ఉంటుంది. పిల్లలు, పెద్దలు అందరూ తయారీలో భాగమవుతున్నారు. ప్రభుత్వం గుర్తించి తాళ్ల తయారు చేసే యంత్రాలను సబ్సిడీపై అందిస్తే బాగుంటుంది.

–రమేష్ నాయక్, కనకాపూర్ తండా

మంచి ఉపాధి

మా తండాలో ప్రతి ఇంటి వద్ద తయారు చేసే తాళ్లను పెద్ద పెద్ద సంతలకు తీసుకెళ్లి అమ్ముకొస్తాం. సారా తయారు చేయడాన్ని అందరు మానేశారు. ఇప్పుడు తాళ్లను తయారు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. ఇది మా కుటుంబాలకు మంచి ఉపాధిగా మారింది. ప్రభుత్వం మాకు అండగా నిలిస్తే మరింతగా ఉపాధి పొందడానికి అవకాశం ఉంటుంది.

–దేవమ్మ, కనకాపూర్ తండా

స్వామి నారాయణ్ గురుకుల్‌లో దీపావళి సంబరాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని నాగసాల సమీపంలో ఉన్న స్వామినారాయణ్ గురుకుల అంతర్జాతీయ పాఠశాలలో శుక్రవారం దీపావళి సంబరాలు నిర్వహించారు. ఆంగ్ల వారోత్సవాల ముగింపు వేడుకలతోపాటు దీపావళి వేడుకలు జరిపించారు. పాఠశాల డైరెక్టర్లు భావిష్, అక్షర భగత్‌జీ మాట్లాడుతూ దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. దీపావళి అంటే దీపాల వరస అని దీపం వెలిగించటం చీకటిని పారద్రోలటమేనన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో దీపాలు వెలిగింపజేశారు. వెలుతురునిచ్చే టపాసులను కాల్పించి తెలుగు సంప్రదాయాలను గుర్తుచేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాల కో ఆర్డినేటర్ రాఘవాదిత్య, సాయిలక్ష్మి, సీసీఏ ఇన్‌చార్జ్ సాకేత్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రావణి, కవిత పాల్గొన్నారు.



పనులు చేయని వారు ఓట్లడుగుతున్నారు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కనీసం రెండు పనులు కూడా చేయని వారు ఇప్పుడు ప్రజలను ఓట్లడుగుతున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 43, 27 పరిధిలో, 31వార్డు వీరన్నపేట్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. అడగక ముందే అన్నీ ఇస్తున్న బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ కేసి నర్సింహులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్, జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, పార్టీ వార్డు అధ్యక్షుడు శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చేరికలు

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మంత్రి ఫాం హౌస్‌లో 9 వార్డుకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, హన్వాడ మండలంలోని దయ్యాలమర్రితండా నాయకులు, వేపూర్‌కు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీరామ్‌లతో పాటు పార్టీలో చేరారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, కృష్ణమోహన్, శాంతన్నయాదవ్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛ కోరుకుంటున్నారు

పాలమూరు: మహబూబ్‌నగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో, ఆ తర్వాత ఎర్రసత్యం చౌరస్తా, రైల్వే స్టేషన్ రోడ్, సద్దలగుండు చౌరస్తా, శివాజీ చౌరస్తా, మల్లికార్జున్ చౌరస్తా, న్యూటౌన్‌లలో రోడ్‌షోతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛ, ప్రశాంత వాతావరణం కోరుకుంటున్నారన్నారు. నేతలు బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జయశ్రీ, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

గండేడ్: మండల పరిధిలోని జిన్నారంలో బీఆర్ఎస్ నాయకులు పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, మండల అధ్యక్షుడు పెంట్యా నాయక్, రైతు సమితి అధ్యక్షుడు ఉప్పరిగోపాల్, వైస్‌ఎంపీపీ ఈశ్వరప్పగౌడ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



జడ్చర్ల టౌన్: ఆల్ ఇండియా సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే పాలమూరు యూనివర్సిటీ జట్టుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని డి. శిల్ప ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆమెను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, ఇన్‌చార్జ్ పీడీ వెంకటేశ్వర్లు అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: దళితుల హక్కులు, రాజ్యాంగాన్ని రక్షించుకుందామనే డిమాండ్‌లో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, మాచన్‌పల్లి, రామచంద్రాపూర్, కోడూర్ గ్రామాలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ దళితులపై దాడులను అరికట్టడంతో పాటు రాజ్యాంగ సవరణలు ఆపాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 4న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, సహాయ కార్యదర్శి భగవంత్, పాండు, కురుమూర్తి, ఖాదర్, వెంకట్రాములు, చిన్న కుర్మయ్య, అంజి, వెంకటస్వామి, పెద్ద కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



మందిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: ధన్వాడ మండలంలోని ఆయాగ్రామాల్లో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. ఎన్నికలో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు వాహిద్, జెడ్పీటీసీ విమల, మండల ఇన్‌చార్జి రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, చంద్రశేఖర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

దామరగిద్దలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి ప్రజలను కోరారు.

మరికల్‌లో మండలంలో అప్పంపల్లి, పల్లెగడ్డ, తీలేర్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే ఎ. రాజేందర్‌రెడ్డి ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందజేసినట్లు తెలిపారు.

అభివృద్ధి మాటున అరాచకం

స్టేషన్ మహబూబ్‌నగర్: నియోజకవర్గంలో అభివృద్ధి మాటున అరాచకం, దోపిడీ జరిగిందని కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తన నామినేషన్ సందర్భంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా యెన్నం దంపతులు శ్రీరేణుక ఎల్లమ్మ, అప్పన్నపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. యెన్నం ఇంటి వద్ద మతపెద్దలు సర్వమత ప్రార్థనలు చేసి ఆయనను ఆశీర్వదించారు. అనంతరం మెట్టుగడ్డ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. చేపట్టారు. ప్రచార రథంలో యెన్నం ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్, ఎం .సురేందర్‌రెడ్డి, బెక్కరి అనిత, రాధా అమర్, సిరాజ్‌ఖాద్రీ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్‌నగర్‌లో పార్లమెంట్ ఇన్‌చార్జ్ రాజగాని అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామన్న బీజేపీ మాట నిలబెట్టుకోలేదని అన్నారు. బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. న్యూ బస్టాండ్ చౌరస్తాకు చేరుకుని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మల్లెల అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా జైరాం కొండన్న, ఐపీ వినోద్, నాగేష్, జి.వి నయ్‌కుమార్, రేడియం వెంకటేష్, ధనుంజయ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఎల్.రమేష్, కౌన్సిలర్లు రామ్ లక్ష్మణ్, రాషత్‌ఖాన్, రాజు, పాపరాయుడు, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్, నాయకులు విజయ్‌కుమార్, రాజు, కె.తిరుమలయ్య, పండరి నాగేష్, అంజమ్మ, పద్మమ్మ, ప్రశాంతి, భాగ్యమ్మ, ప్రవీణ్, చిన్న నర్సిములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) / జడ్చర్ల / దేవరకద్ర: రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 3 వ తేదీ నుంచి శుక్రవారం వరకు జరిగిన నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన పార్టీలతో పాటు బీఎస్పీ, భారత చైతన్య యువజనపార్టీ, ధర్మసమాజ్‌పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లువేశారు. ఈ సందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. 13 నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. జిల్లా కేంద్రంలో 3 నుంచి 10వ తేదీ వరకు 31 మంది నామినేషన్లు వేశారు.

జడ్చర్లలో చివరిరోజు కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి నామినేషన్ వేశారు. చివరిరోజు 16 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. గడువు ముగిసేసరికి బరిలో 20 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఆర్ఓ మోహన్‌రావు తెలిపారు. మొత్తంగా 37 సెట్లు దాఖలు చేశారని వివరించారు. ఈ సందర్భంగా నేతాజీ చౌరస్తాలో జరిగిన కార్నర్‌మీటింగ్‌లో నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

దేవరకద్ర నియోజకవర్గం నుంచి మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. మొత్తం 28 నామినేషన్ల సెట్లను అందజేశారు. చివరి రోజు ప్రక్రియ పోటా పోటీగా సాగింది. పోలీసులు చివరి రోజు అత్యుత్సాహం ప్రదర్శించారు మీడియా వారిని కూడా కనీసం ఆర్ఓ కార్యాలయం బయట కూడా ఉండరాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తరఫున శుక్రవారం ఆయన కుమార్తె ఆల ప్రీతీ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జి. మధుసూదన్‌రెడ్డి సైతం శుక్రవారం ఒక నామినేషన్ వేయగా.. ఆయన సోదరుడు భాస్కర్ రెడ్డి మధుసూదన్‌రెడ్డి పేరున మరో నామినేషన్ చేశారు. బీజేపీ అభ్యర్థి కొండ ప్రశాంత్‌రెడ్డి రెండు సెట్లు, తల్లి కొండ విజయలక్ష్మి, అదేవిధంగా .. బీజేపీకి చెందిన దేవరకద్ర బాలన్న, బీఎస్పీ అభ్యర్థి సంతోష్‌కుమార్‌రెడ్డి తదితరులు సైతం శుక్రవారం నామినేషన్ వేశారు.



పత్రాలు సమర్పిస్తున్న దేవరకద్ర బాలన్న

కుక్క అడ్డురావడంతో బైక్ పై నుంచి పడి..

- చికిత్స పొందుతూ మహిళ మృతి

మహమ్మదాబాద్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓమహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన పుట్టి శంకరయ్య, శాంతమ్మ(48) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ, కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం దగ్గర్లో ఉన్న చౌదర్‌పల్లి సంతకు శాంతమ్మ, కుమారుడు అశోక్ ద్విచక్ర వాహనంపై కూరగాయలు తీసుకుని వెళ్లారు. మార్గమధ్యలో బోరింగ్ తండా సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా వారి వాహనానికి కుక్క అడ్డుగా వచ్చింది. ఈ క్రమంలో వారు బైక్ పైనుంచి కిందపడిపోయారు. ఘటనలో అశోక్‌కు స్వల్పగాయాలు కాగా, శాంతమ్మ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో ఆమెను మొదట ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం శాంతమ్మ మృతిచెందింది. ఘటనపై ఆమె భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

హరినామ సంకీర్తనతో మోక్షం



తిరుమలలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: హరినామ సంకీర్తన చేయడం ద్వారా మోక్షం లభిస్తుందని భక్తులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో మున్సిపాలిటీలోని 16 వార్డు (బోయపల్లి) శ్రీ శివరామాంజనేయ భజన మండలి సభ్యులు శుక్రవారం పాల్గొన్నారు. భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంగలో నడవాలని సూచించారు. భజన బృందం సభ్యులు బదిగె రామచంద్రయ్య, భగవాన్, కోట్ల సంజీవయ్య, బి.కృష్ణయ్య, కోట్ల నర్సిములు, ఎ.వెంకటయ్య, సత్యనారాయణ, మాసయ్య, సంజీవ, మల్లేష్, హన్మంతు, కోట్ల గోవర్ధన్, వెంకటేశ్, మైబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99516 02829

మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557

నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785

వనపర్తి జిల్లా: 95539 55603

జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603

నారాయణపేట జిల్లా: 90109 62007

Office mail : advtmbnr@gmail.com